తారెత్తించిన సూరీడు


ఎండ తీవ్రతకు చీరకొంగు నెత్తిన వేసుకుని వెళ్తున్న మహిళ

- 42 డిగ్రీల వేడిని ఫీల్ అయిన ప్రజలు
- ఉదయం 7 గంటల నుంచే వేడి గాలులు
- మధ్యాహ్నం మంట పుట్టించిన సూరీడు
- శీతల పానీయాలను ఆశ్రయించిన జనం
- యోగాంధ్ర, ఎండ కారణంగా బోసిపోయిన రహదారులు


నిర్మానుష్యంగా మారిన చావులమదుం రోడ్డు


ఎండ వేడికి షర్బత్ బండిని ఆశ్రయించిన వాహన చోదకులు, పాదచారులు


కొనుగోలుదారులు లేని అల్లిపురం మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్

అల్లిపురం: శనివారం సూరీడు అగ్నిగోళంలా మారాడు. దాంతో వేడి తట్టుకోలేక ప్రజలు విలవిల్లాడారు. యోగాంధ్ర కార్యక్రమంతో జనం తెల్లవారు జామునే రోడ్డెక్కినప్పటికీ, ఉదయం 10 గంటల నుంచి భానుడు తన ప్రతాపం చూపించాడు. అత్యవసర పనులపై బయటికి వెళ్లిన వారు గొడుగులను ఆశ్రయించారు. ఎండ వేడిమిని తట్టుకోలేక చెట్ల నీడల్లో సేదదీరారు. చిరువ్యాపారులు గొడుగుల రక్షణలో వ్యాపారాలు చేసుకున్నప్పటికీ కొనుగోలు దారులు లేక అల్లిపురం, రామకృష్ణా రైతు మార్కెట్, అల్లిపురం మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్, అల్లిపురం మెయిన్‌రోడ్డు, రైల్వేస్టేషన్ ఏరియా, దొండపర్తి డీఆర్ఎం కార్యాలయం రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ తదితర ప్రాంతాలు జనసంచారం లేక బోసిపోయాయి. దీంతో విక్రేతలకు వ్యాపారాలు లేకుండా పోయాయి. ఎండ వేడిమిని తట్టుకోలేక శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు తాగేందుకు జనం ఆసక్తి చూపించారు. మరో రెండు రోజులు ఈ వేడిమి ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

అత్యవసర సమయంలో బయటికి వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గొడుగులు ఉపయోగించాలని, అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లరాదని హెచ్చరిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు బయటికి వెళ్లకపోవడమే మంచిదంటున్నారు. ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే బయటికి వెళ్లాలని సూచిస్తున్నారు.


గొడుగు నీడలో బయటికి వచ్చిన వృద్ధుడు

నిర్మానుష్యం


నిర్మానుష్యంగా మారిన వన్‌టౌన్ మెయిన్ రోడ్డు


వెలవెలబోతున్న రామకృష్ణా రైతు మార్కెట్.. కాన్వెంట్ జంక్షన్ రోడ్డు


బోసిపోయిన పూర్ణామార్కెట్


కర్ఫ్యూను తలపిస్తున్న జగదాంబ జంక్షన్‌లోని క్లాక్ టవర్ ఏరియా

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గం శనివారం నిర్మానుష్యంగా మారింది. ఓ వైపు ఎండ తీవ్రత.. మరోవైపు యోగాంధ్ర కార్యక్రమం నేపథ్యంలో నియోజకవర్గం పలు ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే జగదాంబ జంక్షన్‌లో ఉదయం 10 గంటలైనా రద్దీ కనిపించలేదు. కూరగాయాల వ్యాపారాలతో సందడిగా ఉండే పూర్ణామార్కెట్, రామకృష్ణా రైతుమార్కెట్, కాన్వెంట్ జంక్షన్ హోల్‌సేల్ మార్కెట్‌తో పాటు కురుపాం మార్కెట్, అల్లిపురం మార్కెట్, దండు బజార్, రెల్లి వీధి చేపల బజార్ తదితర మార్కెట్లు, చేపల బజార్లకు కళ తప్పింది. కొనుగోలుదారులు లేకపోవడంతో వ్యాపారాలు సాగక విలవిల్లాడారు. ఫుట్‌పాత్ వ్యాపారులు కూడా ఎండ తీవ్రతకు భయపడ్డారు. అగ్ని కుంపటిగా భానుడు ప్రతాపం చూపడంతో యోగాంధ్ర కార్యక్రమానికి వెళ్లిన వారు కొందరైతే.. ఎండకి భయపడి ఇంటి నుంచి బయటికి రాని వారు మరికొందరు. నిప్పుల కుంపటికి ఇటు చిన్నారులు.. అటు వృద్ధులు అవస్థలు పడ్డారు.

క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ


తులసిపూజలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి వీల్ చైర్ అందజేత


వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లిపురం: నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలికి అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ చేతుల మీదుగా 33 వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్తాబత్తుల రమేష్ శనివారం వీల్‌చైర్ అందజేశారు. నారాయణ స్ట్రీట్‌లో రోడ్డుపై బతుకుతున్న వృద్ధురాలు లేచి నిలబడలేని స్థితిలో ఉన్నట్లు గమనించి వీల్‌చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరపల్లి రాము, విశాఖ జిల్లా బీసీ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, ఎర్నిమాంబ దేవస్థానం చైర్మన్ లండా రమణ, సౌత్ కల్చరల్ వింగ్ సూర్యనాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బూరుగుల చిన్న, పీవీఎన్ రెడ్డి, లింగం శీను, ఆలయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవాలి


విశేష పూజలో శ్రీకృష్ణ పరమాత్ముడు

దాబాగార్డెన్స్: పాతనగరంలోని శ్రీగీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం బహుళ ఏకాదశి సందర్భంగా సమితి సభ్యులచే సంపూర్ణ గీతా పారాయణం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకుడు వి.ఆదిత్య శర్మ సాంప్రదాయ రీతిన గోసమేత శ్రీకృష్ణ పరమాత్ముని ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు నిర్వహించి విశ్వరూప భగవానునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధూప దీప నైవేద్యం, మంత్ర పుష్పాలు, దివ్య మంగళహారతి సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ శ్రీకృష్ణ పరమాత్ముడు ప్రసాదించిన భగవద్గీత ప్రాముఖ్యత వివరించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత సారాంశం తెలుసుకోవాలన్నారు. సోకాలు పోగొట్టే శ్లోకాలు ఒక్క భగవద్గీతలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వనజాదేవి, ప్రచార సమితి ప్రతినిధులు జి.లక్ష్మీనరసింహా, జి.కనకమహాలక్ష్మి, ప్రమీల, రేవతి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో బల్లిగిరి వెంకన్న

అల్లిపురం: జ్యేష్ఠ ఏకాదశి సందర్భంగా శనివారం బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తుల గోత్రనామాలతో సహస్రనామాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

యువత పోరు వినపడదా బాబూ?


కార్పొరేటర్ తోట పద్మావతి, పార్టీ నాయకులతో జిల్లా పరిషత్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వాసుపల్లి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుపల్లి తదితరులు

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 23న నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్ పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అబద్ధాల పుట్ట అని మరోసారి రుజువైందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో యువతకిచ్చిన హామీలు గాలికి వదిలేసారన్నారు. రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఏడాది గడచినా ఆ ఊసే లేదన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఇలాగే నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల చివరి రెండు నెలలు వేసి మభ్యపెడదామని చూశారన్నారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, పలు వార్డుల అధ్యక్షులు నీలాపు సర్వేశ్వర రెడ్డి, దశమంతుల మాణిక్యాలరావు, రాజారెడ్డి, అలవన కనకరెడ్డి, మహ్మద్ షకీల్, ఆకుల యేసు, ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్ 33వ వార్డు నాయకుడు ముత్తాబత్తుల రమేష్, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండా రమణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, జిల్లా కార్యదర్శి అభిరెడ్డి ఆదివిష్ణురెడ్డి, జిల్లా ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు వడ్డాది దిలీప్‌కుమార్, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు దూడ అప్పారావు, విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు గరికిన వేంకటేష్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కోన శంకర్, స్టేట్ మహిళా విభాగం కార్యదర్శి రీను అనురాధ, సౌత్‌క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువార్త రాజు, ఆకుల శ్యామ్, వీటీ కృష్ణకుమార్, మల్లా బుజ్జి, బోనుగు రాజుపాత్రుడు, కొణతాల కృష్ణవేణి, పెనుగంటి సూర్యనాయుడు, బెవర మహేష్, గరికిన చంద్రశేఖర్, పిల్లా అప్పారావు, జీరు సూర్యనారాయణ, సాగర్, దశమంతుల చిన్ని, భానుమూర్తి, రాము, కోరాడ సురేష్, బోరా శ్రీనివాసరెడ్డి, రామరాజు, నాగమణి, వేణు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు కార్యక్రమ ప్రాంతం పరిశీలన..

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 23న నిర్వహించనున్న యువత పోరు నిర్వహించే జిల్లా పరిషత్ జంక్షన్ ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ శనివారం 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, పలువురు పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కూటమి నాయకులు తక్షణమే నిరుద్యోగులకు 12 నెలల బకాయి నిరుద్యోగ భృతి రూ.36 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యువత పోరు కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకరమైన జీవితం


యోగాసనాలు వేస్తున్న బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ తదితరులు


సూర్య నమస్కారాలు చేస్తున్న వివేకానంద ఆశ్రమ వాసులు


యోగాసనాలు వేస్తున్న మెడికవర్ వైద్యులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జగదాంబ జంక్షన్ సమీపాన మెడికవర్ ఆస్పత్రి వైద్యులు శనివారం యోగాసనాలు వేశారు. ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఎలా ఉపకరిస్తుందో తెలియజేస్తూ యోగా దినోత్సవం జరిపారు. అంతర్జాతీయ యోగా ట్రైనర్ డాక్టర్ శిల్పా నేతృత్వంలో వైద్యులు, వైద్య సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. కరుణాకర్, డాక్టర్ అరుణ్‌కుమార్‌తో పాటు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో..

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని..యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పాతనగరం స్వామి వివేకానంద సంస్థ ఆశ్రమ వాసులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ ఆరోగ్యమే..మహాభాగ్యం, మనం నిత్యం సంతోషంగా ఉండాలంటే ముందు మనం ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యంగా ఉండాలంటే యోగా నిత్య జీవితంలో భాగం చేయాలన్నారు.

విజయవంతంగా యోగాంధ్ర

మహారాణిపేట: ప్రధాని మోదీ పిలుపునందుకుని నేడు 191 దేశాలలో యోగా దినోత్సవం జరుపుకున్నారని, విశాఖలో కూడా ఈ కార్యక్రమం విజయవంతం అయిందని బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రధాని మోదీ, సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగిందన్నారు. మోదీ ఆకర్షణ, పిలుపు అందుకుని తెల్లవారు జాము 2 నుంచి లక్షలాదిగా ప్రజలు తరలి వచ్చారన్నారు. ప్రశాంత వాతావరణంలో సముద్రం ఒడ్డున జరిగిన యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ ప్రసంగించి అందరినీ ఉత్తేజపరిచారని అన్నారు. ప్రపంచ శాంతికి యోగా సాధనమని అన్నారు. యోగా కార్యక్రమంలో గేదెల శ్రీహరి, వై. భాస్కర్, తేజస్వి, నగర బీజేపీ ఉపాధ్యక్షురాలు తలాడ గిరిజ, కృష్ణారావు తదితరులు పాల్గొని మధురానుభూతి పొందారు.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. యోగాంధ్ర కార్యక్రమం ఉన్నప్పటికీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నానికి విద్యార్థుల హాజరు పూర్తి స్థాయిలో ఉంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 7,501 నుంచి 15,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 296 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. వీరిలో 234 మంది బీసీ విద్యార్థులు, 44 మంది ఓసీలు, 17 మంది ఎస్సీలు, ఒకరు ఎస్టీ విద్యార్థి ఉన్నారు. వీరందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నకుమార్ పర్యవేక్షణలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం. భాషా, లెక్చరర్ నాగరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం 23,501 నుంచి 32,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ లో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. ఇక్కడ 1 నుంచి 7,500 ర్యాంక్ వరకు గల విద్యార్థులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ అందించారు.

రికార్డు ప్రయత్నం.. నిర్వహణలోపం


తిమ్మాపురంలో మ్యాట్లకోసం కుమ్ములాట


పండ్ల కోసం కుమ్ములాట

కొమ్మాది: లక్షల మందితో యోగాసనాలు వేయించి ప్రపంచ రికార్డు సృష్టించాలనే లక్ష్యంతో చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమం ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది. శ్రీకాకుళం, విజయనగరం, సింహాచలం, పాడేరు వంటి ప్రాంతాల నుంచి తెల్లవారు జామున 4 గంటలకే ప్రజలను బస్సుల ద్వారా భీమిలి బీచ్‌రోడ్డులోని గుడ్లవానిపాలెం నుంచి ఉప్పాడ వరకు ఏర్పాటు చేసిన కంపార్ట్‌మెంట్ల వద్దకు తీసుకొచ్చారు. అయితే రవాణా వ్యవస్థలో సమన్వయం లోపించడంతో బస్సులు కిలోమీటర్ల మేర నిలిచిపోయి ప్రజలు నడుచుకుంటూ కార్యక్రమ స్థలానికి చేరుకోవాల్సి వచ్చింది. తిమ్మాపురంలో పండ్లు, యోగా మ్యాట్లు, మంచినీటి పంపిణీ విషయంలో తీవ్ర తోపులాటలు చోటు చేసుకున్నాయి. మొబైల్ టాయిలెట్లను దూరంగా ఏర్పాటు చేయడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులకు కూడా సరైన వసతులు కల్పించకపోవడంతో వారు ఫుట్‌పాత్‌లపైనే పడుకోవాల్సి వచ్చింది. రికార్డుల పట్ల ఉన్న శ్రద్ధ.. ప్రజల సౌకర్యాలపై లేకపోవడంతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

యోగా పుణ్యం.. ప్రయాణం నరకం


బస్సుల కోసం నిరీక్షిస్తున్న రైల్వే ప్రయాణికులు


ఆటోలను ఆశ్రయిస్తున్న రైల్వే ప్రయాణికులు


చావుల మదుం వద్ద బస్సుల కోసం మండుటెండలోనే వేచి ఉన్న ఉద్యోగులు, కార్మికులు

- బస్సులు లేక ఆటో డ్రైవర్ల దోపిడీ

దాబాగార్డెన్స్: విశాఖలో నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమం కారణంగా ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించగా.. రైల్వే ప్రయాణికులు, ఉద్యోగులు నరకయాతన అనుభవించారు. కార్యక్రమానికి వందలాది ఆర్టీసీ బస్సులను తరలించడంతో శుక్రవారం తెల్లవారు జాము నుంచే నగరంలో రవాణా కష్టాలు మొదలయ్యాయి. హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి రైళ్లలో నగరానికి చేరుకున్న ప్రయాణికులు, తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు వాహనాలు లేక రైల్వే స్టేషన్‌లోనే గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఇదే సమయంలో ఇతర ప్రాంతాలకు రైళ్లలో వెళ్లాల్సిన వారు కూడా స్టేషన్‌కు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకున్న ఆటో డ్రైవర్లు, ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేశారు. దీనికి తోడు, అనేక ఆటోలను కూడా యోగాంధ్ర కార్యక్రమానికే బుక్ చేయడంతో నగరంలో వాహనాల కొరత ఏర్పడింది. బస్సులు లేకపోవడంతో డాక్‌యార్డ్, సింధియా వంటి సంస్థలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు సైతం బస్ పాసులు ఉన్నప్పటికీ సమయానికి విధులకు హాజరుకాలేక తీవ్ర అవస్థలు పడ్డారు.

పరిసరాల పరిశుభ్రతతో పర్యావరణ పరిరక్షణ


సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: జిల్లా పరిషత్‌లో 'స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర' మూడో శనివారం కార్యక్రమం జరిగింది. సీఈవో పి.నారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ప్రాంగణాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం సూపరింటెండింగ్ ఇంజినీర్, పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయాల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏపీపీఆర్ఎంఈఏ అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, ఏపీఎన్‌జీవో జాయింట్ సెక్రటరీ ఎ.మదన్ మోహన్, పరిపాలనాధికారులు మంజులవాణి, ఎం.నరసింహమూర్తి, పి.వి.వి.ఎస్.మూర్తి, రాజేశ్వరి, జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది, పంచాయితీరాజ్ అధికారులు, సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రలో పోలీసుల అత్యుత్సాహం


పాండురంగాపురం వాసులను అడ్డుకున్న పోలీసులు


అంబులెన్స్‌ను సైతం ఆపేసిన పోలీసులు

- సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టిన వైనం

బీచ్ రోడ్డు: యోగాంధ్ర కార్యక్రమం సందర్భంగా ప్రధాని మోదీ కాన్వాయ్ రాక నేపథ్యంలో పోలీసులు ప్రదర్శించిన అత్యుత్సాహం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. ఉదయం 5 గంటల నుంచే పాండురంగాపురం జంక్షన్ వద్ద పాదచారులు, వాహనాలను 80 నిమిషాల పాటు నిలిపివేయడంతో స్థానికులు, సందర్శకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, ఉదయం నడకకు వెళ్లేవారు, ఉద్యోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. రెండు రోజుల పాటు విశాఖ సందర్శనకు చెన్నై నుంచి వచ్చిన యువతీ యువకులకు పోలీసులు చుక్కలు చూపించారు.. వారు తిరిగి వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు బయలుదేరగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. తమకు 6.40 గంటలకు ట్రైన్ ఉందని, రైల్వే స్టేషన్‌కు వెళ్లాలని పోలీసులను ప్రాధేయపడినా పట్టించుకోలేదు. ప్రధాని కాన్వాయ్ వెళ్లినంత వరకు అక్కడే నిలిపివేశారు. పోలీసుల తీరుపై పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓ అంబులెన్స్‌ను నిలిపివేశారు.

ఉద్యోగం పోతే పోనీ..

జిమ్‌కు టైమవుతుందని, సమయానికి వెళ్లకపోతే చాలా మంది ప్రముఖులు ఇబ్బంది పడతారని ఓ ట్రైనర్ పోలీసులను వేడుకున్నా పట్టించుకోలేదు. జిమ్‌కు వెళ్లకపోతే నా ఉద్యోగం పోతుందని పోలీసులను ప్రాధేయపడ్డాడు. అయినా సరే సదరు పోలీసులు ఉద్యోగం పోతే పోనీ వెళ్లడానికైతే వీలు లేదంటూ ఆయనను నిలిపివేశారు. అలాగే దస్‌పల్లా హిల్స్‌లోని ఓ ఇంట్లో పాము దూరిందని చెప్పినా, స్నేక్ స్నాచర్‌ను పోలీసులు అనుమతించలేదు.